
TGTEL/26/A2635
DD9 వాస్తవాలు పలుకు
# వార్త
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 16 | 27-05-2026 మంగళవారం | పేజీలు: 04 | వెల: 3/-




## క్రేజీ కాంబో.. 'బాలన్ ది బాయ్' సినిమా కోసం అక్కినేని నాగార్జునతో చేతులు కలిపిన మేకర్స్




# వెలుగుమట్ల బాధితుల సమస్యలు పరిష్కరించండి

**లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిసిన కవిత**
**భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని ప్రధాన డిమాండ్**
**వెలుగుమట్ల బాధితులకు ఇళ్ల స్థలాల కేటాయించాలని విజ్ఞప్తి**
**కడ్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ భూసేకరణ నోటీసుల రద్దు డిమాండ్**
**ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పుపై వినతి**
**బాధితులతో కలిసి గవర్నర్‌ను కలిసిన ప్రతినిధి బృందం**
**భూసేకరణ వల్ల ప్రభావిత కుటుంబాల ఆవేదన వెల్లడి**
**సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమ బాట హెచ్చరిక**
**ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లిన కవిత**
**న్యాయం కోసం మళ్లీ పోరాటానికి సిద్ధమని స్పష్టీకరణ**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూ నిర్వాసితుల సమస్యలు, వికారాబాద్ జిల్లా కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ భూసేకరణ వివాదం, అలాగే ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు అంశాలపై ప్రభావితుల సమస్యలను పరిష్కరించాలంటూ తెలంగాణ రక్షణ సేన (టీ ఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కోరారు.
లోక్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వెలుగుమట్ల, కడ్లాపూర్ ప్రాంతాల్లో భూ సేకరణ కారణంగా నష్టపోయిన ప్రజలతో కలిసి తాము గవర్నర్‌ను కలిసినట్లు తెలిపారు. భూములు కోల్పోయిన ప్రతి కుటుంబానికి న్యాయం జరగాలని తాము వినతిపత్రం సమర్పించినట్లు వివరించారు.
ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలో ఇళ్లను కోల్పోయిన బాధితులందరికీ ప్రత్యామ్నాయంగా తగిన ఇంటి స్థలాలు కేటాయించాలని గవర్నర్‌ను కోరినట్లు కవిత పేర్కొన్నారు. జీవనాధారం కోల్పోయిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందుల్లో ..మిగతా 2లో



## మావోయిస్టు అగ్రనేత నరహరి దంపతుల లొంగుబాటు

**రూ. 45 లక్షల పునరావాస చెక్కులు అందజేసిన డీజీపీ సీవీ ఆనంద్**
**అజ్ఞాతంలో మిగిలింది కొద్దిమంది మాత్రమే**
**హైదరాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో కీలక పరిణామం**
**స్వచ్ఛందంగా లొంగిపోయిన మావోయిస్టు జంట**
**లక్షల విలువైన పునరావాస ప్యాకేజీ**
**నరహరికి రూ. 25 లక్షలు, లతకు రూ. 20 లక్షల చెక్కుల పంపిణీ**
**కాజీపేట విద్యార్థి నుండి కేంద్ర కమిటీ సభ్యుడి వరకు**
**పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్ నేపథ్యం**
**ఆయుధాల తయారీ, బాంబుల అనుసంధానంలో మేధావి**
**వందలాది మంది కేడర్‌కు శిక్షకుడిగా ప్రస్థానం**
**జైలు శిక్ష పడినా వీడని ఉద్యమ బాట**
**ఏడేళ్ల జైలు జీవితం తర్వాత మళ్లీ అడవి బాట పట్టిన ధనమ్మ**
**దేశవ్యాప్తంగా కుంచించుకుపోయిన నక్సల్స్ ప్రభావం**
**కేవలం 47 మంది మాత్రమే అజ్ఞాతంలో ఉన్నట్లు వెల్లడి**
**తెలంగాణలో కేవలం ముగ్గురే మిగిలారన్న డీజీపీ సీవీ ఆనంద్**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
నిషేధిత మావోయిస్టు పార్టీకి ఊహించని రీతిలో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. దశాబ్దాలుగా అడవుల్లో అజ్ఞాతవాసం గడుపుతూ, పార్టీ వ్యూహాల్లోనూ, ఆయుధాల తయారీలోనూ అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు ఆయన భార్య, మావోయిస్టు స్టేట్ కమిటీ మెంబర్ అయిన మెదారి ధనమ్మ అలియాస్ లత కూడా ఇవాళ తెలంగాణ పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయారు.హైదరాబాద్‌లోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సమక్షంలో ..మిగతా 2లో



## చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంత కొనుగోలు చేశారు?**
**గత ప్రభుత్వం కంటే ఎక్కువ కొంటున్నాం**
**కేంద్రం నిర్లక్ష్యంగా ఉంటే ఇక్కడ యాత్రలు ఏంటి?**
**బీజేపీ, బీఆర్ఎస్‌పై మంత్రి ఉత్తమ్ ఫైర్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంత ధాన్యం కొనుగోలు చేశారో చెక్ చేసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్ అయ్యారు. మంగళవారం సచివాలయంలో మీడియాతో చిట్ చాట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ..మిగతా 2లో

## ప్రభుత్వానివి తప్పుడు లెక్కలు

**రైతులను కాంగ్రెస్ మోసం చేస్తున్నది**
**ధాన్యం కొనుగోళ్లపై తప్పుడు లెక్కలు చెబుతున్నది**
**మేము వస్తున్నామని తెలిసి లారీలు వస్తున్నాయి**
**బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతూ రైతులను ఘోరంగా మోసం చేస్తున్నదని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు ..మిగతా 2లో



# తెలంగాణలో నిప్పుల కొలిమి

**పలు జిల్లాలకు వాతావరణ శాఖ 'రెడ్ అలర్ట్' హెచ్చరిక**
**జనాన్ని వణికిస్తున్న అతి తీవ్ర వడగాలులు**
**మునుపెన్నడూ లేని విధంగా మండుతున్న ఎండలు**
**వడగాలుల తీవ్రతకు జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తం**
**ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలపై సూర్యుడి ప్రతాపం**
**ఉక్కిరిబిక్కిరి అవుతున్న పల్లెలు, పట్టణాలు**
**తొలిరోజు పలు జిల్లాలకు అత్యవసర రెడ్ అలర్ట్**
**ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్ పరిధిలో హై అలర్ట్**
**రాబోయే రెండు రోజుల్లో మరింత పెరగనున్న ముప్పు**
**వాతావరణ కేంద్రం నుండి వరుస హెచ్చరికలు**
**మిగిలిన ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**
**అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారుల సూచన**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణ రాష్ట్రంలో వేసవి కాలం అత్యంత భీతి గొలిపేలా మారింది. సూర్యుడు తన మండుటెండలతో ప్రతాపాన్ని చూపిస్తుండటంతో పగటిపూట రోడ్లపైకి రావాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు. ఒకవైపు ఆకాశం నుండి కురుస్తున్న నిప్పులు, మరోవైపు శరీరానికి అగ్ని సెగలు తగిలేలా వీస్తున్న వడగాలుల మధ్య నలిగిపోతూ అబాలగోపాలం ప్రతిరోజూ నరకయాతన అనుభవిస్తున్నారు.పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా నమోదు కావడం వల్ల అత్యవసర పనులు ఉన్నప్పటికీ ప్రజలు ఉదయం పది దాటిన తర్వాత బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. సాధారణంగా వేసవి వేడి నుండి కాస్త ఉపశమనం లభించే గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైతం ఈసారి ప్రకృతి సృష్టిస్తున్న ఈ వేడిని తట్టుకోలేక ఇబ్బంది పడుతుంటే, కాంక్రీట్ వనాల్లా మారిన పట్టణవాసుల ..మిగతా 2లో

# రూ.వెయ్యి కోట్ల ప్రభుత్వ భూమి ప్రైవేటుకు కట్టబెట్టారు

**మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన ఆరోపణలు**
**పెద్దషాపూర్‌లో 170 ఎకరాల భూమి వివాదం**
**రూ.వెయ్యి కోట్ల భూమి స్కామ్ జరిగిందని ఆరోపణ**
**ఆర్డీవో నివేదికను ధిక్కరించిన తహసీల్దార్ ఆదేశాలు**
**రాత్రికి రాత్రే భూభారతిలో మార్పులు చేశారని విమర్శ**
**ప్రైవేటు వ్యక్తులకు భూములు ధారాదత్తం చేశారని ఆరోపణ**
**వెనుక ప్రభుత్వ పెద్దల పాత్ర ఉందని అనుమానం**
**సీసీఎల్ఏ, కలెక్టర్ అనుమతి లేకుండా ఎంట్రీలు జరిగాయా?**
**తహసీల్దార్‌పై చర్యలు తీసుకోలేదని ఆగ్రహం**
**సిట్, సీఐడీ విచారణకు హరీశ్‌రావు డిమాండ్**
**భూమిని నిషేధిత జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లో ప్రభుత్వానికి చెందిన విలువైన భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టినట్లు ఆరోపిస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. సుమారు రూ.వెయ్యి కోట్ల విలువ చేసే 170 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా పట్టా భూమిగా మార్చిన ఘటనలో పెద్ద స్థాయి అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ..మిగతా 2లో



## తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌తో ప్రొఫెసర్ నాగేశ్వర్ భేటీ

**సోషల్ మీడియాలో దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**
**తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నట్లు స్పష్టీకరణ**
**ఏపీ పోలీసులు నోటీసులు ఇవ్వలేదని ప్రకటన**
**పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం**
**ఏపీలో పలు చోట్ల నమోదైన కేసులు**
**అరెస్టు వార్తలను ఖండించిన ఏపీ ప్రభుత్వం**
**తెలంగాణలో అరెస్టు ప్రచారంపై వివరణ**
**అసత్య ప్రచారం జరుగుతోందని ప్రభుత్వ స్పష్టీకరణ**
**సోషల్ మీడియా వదంతులపై ఆందోళన**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిశారు. ఈ సందర్భంగా తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని ఆయన డీజీపీని కోరినట్లు తెలిపారు.
డీజీపీని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ప్రొఫెసర్ నాగేశ్వర్, తనపై వస్తున్న ఆరోపణలు, వదంతులపై స్పష్టత ఇచ్చారు. సోషల్ మీడియాలో తనపై అసత్య ప్రచారం జరుగుతోందని, దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు చెప్పారు. అంతేకాకుండా తాను చేసిన వ్యాఖ్యలను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అలాగే, తనకు ..మిగతా 2లో

# చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

దాని కంటే తాము ఎక్కువ కొనుగోలు చేస్తున్నామని, నిధులు కూడా అత్యధికంగానే కేటాయించామన్నారు. తాము 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. 8,575 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. కేంద్రం ఎంఎస్‌పీ పెట్టి ధాన్యం కొనుగోలు చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. రాష్ట్రంలోని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేసి కేవలం 48 గంటల్లోనే నిధులు జమ చేయనున్నదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే ఎక్కువ ధాన్యం కొనుగోలు చేస్తున్నామని వివరించారు. కేంద్రం నిర్లక్ష్యంగా ఉంటే బీజేపీ నేతలు ఇక్కడ యాత్రలు చేయడం ఏంటని నిలదీశారు. ఇప్పటి వరకు 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. బీఆర్ఎస్ ఖర్చు పెట్టిన దాని కంటే రూ.5 వేల కోట్లు ఎక్కువే తాము ఖర్చు చేశామని చెప్పారు. అడ్డగోలుగా అసత్య ప్రచారాలు చేయడం సరికాదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

# ప్రభుత్వానివి తప్పుడు లెక్కలు

**మొదటిపేజీ తరువాయి**

భారతీయ జనతా పార్టీ చేపట్టిన 'రైతు గోస బీజేపీ భరోసా' యాత్ర రెండో రోజు యాదాద్రి భువనగిరి జిల్లాలో కొనసాగింది. వ్యవసాయ మార్కెట్‌తో పాటు, వడపర్తి ఐకేపీ కేంద్రాన్ని బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసుల వద్దే పడిగాపులు కాస్తున్న రైతులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ యాత్రలో మహేశ్వర్ రెడ్డితో పాటు బీజేపీ ఎమ్మెల్యేలు పైడి రాకేశ్ రెడ్డి, రామారావు పటేల్, వెంకట రమణా రెడ్డి, భువనగిరి మాజీ ఎంపీ బూర నరసయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 80 శాతం పంట కొనుగోలు పూర్తి చేశామని కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. అవన్నీ అబద్ధపు మాటలు, తప్పుడు లెక్కలని మండిపడ్డారు. దమ్ము, ధైర్యం ఉంటే తాను చూపే కొనుగోలు కేంద్రాలకు రావాలని, నెల రోజులుగా రైతులు పడుతున్న కష్టాలను స్వయంగా చూడాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో వరితో పాటు జొన్నలు, సన్‌ఫ్లవర్ పండించిన రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, శనగల కొనుగోలు ప్రక్రియ అసలు ప్రారంభమే కాలేదని ఆరోపించారు. వరంగల్ డిక్లరేషన్ పేరుతో రాహుల్ గాంధీని తీసుకొచ్చి, రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. ఐకేపీ సెంటర్లు, ఏఎంసీ మార్కెట్లలో రైతులు నెల రోజులుగా ధాన్యం కుప్పల వద్దే ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కాపలా కాస్తున్నారని మహేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం గింజలు జోకడానికి గంపలు, సంచులు కూడా ఇవ్వని దుస్థితి నెలకొన్నదని, మరో నాలుగు రోజుల్లో రుతుపవనాలు ప్రారంభం కానున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. రైతుల సమస్యలపై బీజేపీ నేతలు కల్లాల బాట పట్టడంతోనే ప్రభుత్వంలో చలనం వచ్చిందని అన్నారు. తాము వస్తున్నామనే భయంతోనే అప్పటికప్పుడు లారీలను పంపుతున్నారని ఎద్దేవా చేశారు. సోమవారం గజ్వేల్‌కు బీజేపీ బృందం వెళ్లడంతో కలెక్టర్ స్వయంగా వచ్చి 30 లారీలను ఏర్పాటు చేశారని, మంగళవారం భువనగిరి కేంద్రానికి వస్తున్నామని తెలియగానే లారీలు వచ్చాయని చెప్పారు. గత 40 రోజులుగా నిద్రపోయిన యంత్రాంగం, తాము వస్తుంటేనే లారీలు పంపడం వారి వైఫల్యానికి నిదర్శనమన్నారు. తమ రాకతోనే లారీలు వస్తాయంటే రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని సందర్శించడానికి, రైతుల పక్షాన నిలబడడానికి బీజేపీ సిద్ధంగా ఉన్నదన్నారు. అన్నదాతలకు అండగా ఉంటూ, ప్రతి రైతు పండించిన చివరి గింజ కొనుగోలు చేసేంత వరకు బీజేపీ పోరాటం ఆపదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

## రూ.వెయ్యి కోట్ల ప్రభుత్వ భూమి
# ప్రైవేటుకు కట్టబెట్టారు

**మొదటిపేజీ తరువాయి**

మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, నేతలు ఎల్. రమణ, ముఠా గోపాల్‌తో కలిసి హరీశ్‌రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్డీవో కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో పెద్దషాపూర్‌లోని 170 ఎకరాలు ప్రభుత్వ భూమి అని స్పష్టంగా పేర్కొనబడిందని తెలిపారు. అయితే, ఆ నివేదికకు విరుద్ధంగా తహసీల్దార్ రాత్రికి రాత్రే ఆ భూమిని పట్టా భూమిగా పేర్కొంటూ భూభారతి రికార్డుల్లో మార్పులు చేశారని ఆరోపించారు.

ఆర్డీవో ఆదేశాలను ధిక్కరించే స్థాయిలో తహసీల్దార్‌కు ఆ నిర్ణయం తీసుకునే ధైర్యం ఎక్కడి నుంచి వచ్చిందని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఇంత పెద్ద స్థాయి భూ వ్యవహారం జరగడం సాధ్యం కాదని ఆయన వ్యాఖ్యానించారు. భూభారతిలో ఎంట్రీ జరగాలంటే కలెక్టర్, సీసీఎల్ఏ అనుమతులు తప్పనిసరి అని, అయినప్పటికీ వాటిని పక్కన పెట్టి చర్యలు తీసుకున్నారని ఆయన విమర్శించారు.

ఈ వ్యవహారం వెనుక రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దల పాత్ర ఉందనే అనుమానాన్ని కూడా హరీశ్‌రావు వ్యక్తం చేశారు. తహసీల్దార్‌పై గతంలో ఏసీబీ దాడులు జరిగినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన గుర్తు చేశారు. ఇది కేవలం వ్యక్తిగత స్థాయి తప్పిదం కాదని, వ్యవస్థాగత అవినీతి భాగమని ఆయన ఆరోపించారు.

రూ.వెయ్యి కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసిన ఘటనపై సమగ్ర దర్యాప్తు అవసరమని ఆయన డిమాండ్ చేశారు. ఈ కేసులో సిట్ లేదా సీఐడీ విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.

అలాగే వివాదాస్పద భూమిని వెంటనే భూభారతి రికార్డుల్లో నిషేధిత జాబితాలో చేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ వ్యవహారం పట్ల ప్రభుత్వం మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోందని, నిజాలు వెలుగులోకి రావాలంటే నిష్పక్షపాత దర్యాప్తు తప్పనిసరని హరీశ్‌రావు పేర్కొన్నారు.




# వెలుగుమట్ల బాధితుల సమస్యలు పరిష్కరించండి

**మొదటిపేజీ తరువాయి**

ఉన్నాయని, వారికి ప్రభుత్వ స్థాయిలో తక్షణ పరిష్కారం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.

అలాగే వికారాబాద్ జిల్లా కడ్లాపూర్ ప్రాంతంలో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ కోసం జారీ చేసిన భూసేకరణ నోటీసులను రద్దు చేయాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. స్థానిక రైతుల జీవనాధారం భూములపై ఆధారపడి ఉందని, బలవంతపు భూసేకరణ వల్ల వారి భవిష్యత్ ప్రమాదంలో పడుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇక ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్ అలైన్‌మెంట్ మార్పు అంశంపైనా గవర్నర్‌కు వివరించినట్లు కవిత చెప్పారు. ప్రాజెక్టు మార్గంలో మార్పులు వల్ల పలు గ్రామాల ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని, ఈ అంశంపై సమగ్ర సమీక్ష జరగాలని ఆమె కోరారు. బాధితులతో కలిసి తాము అన్ని సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ప్రజల సమస్యలు పరిష్కరించకపోతే మళ్లీ ఉద్యమ బాట పడతామని స్పష్టం చేశారు. భూ నిర్వాసితులకు న్యాయం జరగడం తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల హక్కుల కోసం ఎప్పటికీ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.



ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఈ సమస్యలపై తక్షణమే స్పందించి న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాల ఆవేదనను రాష్ట్ర ప్రభుత్వం గమనించి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాధితుల ప్రతినిధులు కూడా పాల్గొని తమ సమస్యలను గవర్నర్‌కు నేరుగా వివరించినట్లు సమాచారం.

# తెలంగాణలో నిప్పుల కొలిమి

**మొదటిపేజీ తరువాయి**

పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.

**ఉత్తర, తూర్పు తెలంగాణలో సెగలు**

రాష్ట్ర భౌగోళిక పరిస్థితులను పరిశీలిస్తే, ముఖ్యంగా ఉత్తర మరియు తూర్పు తెలంగాణ జిల్లాలపై భానుడు తన ఉగ్రరూపాన్ని స్పష్టంగా చూపిస్తున్నాడు. ఈ ప్రాంతాల్లోని అడవులు, బొగ్గు గనుల ప్రభావం వల్ల వేడి తీవ్రత ఊహించని స్థాయికి చేరుకుంది. ఉదయం ఎనిమిది గంటలకే ఎండ తీవ్రత మొదలై, మధ్యాహ్నానికి అది మరింత ముదురుతోంది.అధిక ఉష్ణోగ్రతలకు తోడు పొడి వాతావరణం, వడగాలులు తోడవడంతో జనం ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ భయానక పరిస్థితులను గమనించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిని సూచించే 'రెడ్ అలర్ట్'ను ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు ఈ రోజుకు సంబంధించి ఈ అత్యవసర హెచ్చరికలు జారీ అయ్యాయి.

**రాబోయే రోజుల్లో విస్తరించనున్న ముప్పు**

వాతావరణ శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం, ఈ ఎండల తీవ్రత ఇక్కడితో ఆగేలా కనిపించడం లేదు. రాబోయే రోజుల్లో ఈ ముప్పు మరికొన్ని ప్రాంతాలకు విస్తరించనుంది. దీనికి సంబంధించి రాబోయే రెండు రోజుల ముందస్తు ప్రణాళికను వాతావరణ శాఖ విడుదల చేసింది. రేపటి దినానికి గాను ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ వర్తిస్తుందని పేర్కొంది.ఇక ఎల్లుండి నాటికి ఈ వేడి గాలుల ప్రభావం మరింత పెరిగి దక్షిణ, మధ్య తెలంగాణ వైపు కూడా దూసుకురానుంది. ఎల్లుండి ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు వాతావరణశాఖ పూర్తి స్థాయి రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో నివసించే ప్రజలు పగటిపూట ప్రయాణాలను పూర్తిగా వాయిదా వేసుకోవడం మంచిదని సూచించారు.

**ఆరెంజ్ అలర్ట్ మరియు వడగాల్పుల తీవ్రత**

రాష్ట్రంలో రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాలు మినహా మిగతా అన్ని జిల్లాల పరిస్థితి కూడా ఏమాత్రం ఆశాజనకంగా లేదు. ఆయా ప్రాంతాలకు వాతావరణ శాఖ 'ఆరెంజ్' హెచ్చరికలు జారీ చేసింది. అంటే అక్కడ కూడా ఎండలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్థం.ప్రస్తుత అంచనాల ప్రకారం, రాబోయే మూడు రోజుల తర్వాత మాత్రమే ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గి, ఒక మూడు డిగ్రీల వరకు కిందకు దిగివచ్చే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. అంతవరకు అంటే ఇవాళ, రేపు రాష్ట్రవ్యాప్తంగా 'అతి తీవ్రమైన వడగాలులు' వీచే అవకాశం ఉందని, ఎల్లుండి తీవ్రమైన వడగాలులు వీస్తాయని అధికారులు స్పష్టం చేశారు.

**తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాలు**

కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భౌగోళిక కారణాల వల్ల 'అతి తీవ్రమైన' వడగాల్పులు వీచే అవకాశం నిరూపితమైంది. అందుకే ఈ జిల్లాల పరిపాలనా యంత్రాంగాలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఎండ దెబ్బకు గురైన వారికి చికిత్స అందించేందుకు అవసరమైన మందులను సిద్ధంగా ఉంచారు.మరోవైపు తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉన్న కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసి, స్థానిక ప్రజలను డీహైడ్రేషన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

**ఉపశమనం కలిగించే అంచనాలు - అకస్మాత్తు వర్షాలు**

ఈ సుదీర్ఘమైన ఎండల నడుమ వాతావరణ శాఖ ఒక ఆసక్తికరమైన మరియు ఊరట కలిగించే సమాచారాన్ని కూడా వెల్లడించింది. తీవ్రమైన వేడి కారణంగా భూమి త్వరగా వేడెక్కి, వాతావరణంలో ఏర్పడే మార్పుల వల్ల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా హఠాత్తుగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.పగటిపూట ఉండే విపరీతమైన ఉష్ణోగ్రతల వల్ల ఆకాశంలో 'క్యుములోనింబస్' మేఘాలు ఏర్పడుతున్నాయని, వీటి ప్రభావంతో ఇవాళ మధ్య, దక్షిణ తెలంగాణ జిల్లాలతో పాటు కొన్ని పశ్చిమ, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా వాతావరణం చల్లబడొచ్చని అంచనా వేసింది.

**ఉరుములు, ఈదురుగాలుల హెచ్చరిక**

క్యుములోనింబస్ మేఘాల కలయిక వల్ల కురిసే వర్షాలు సాధారణంగా ఉండవని, అవి అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుగా మారే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ వర్షాల సమయంలో గాలి పీడనంలో వచ్చే మార్పుల వల్ల గంటకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉంది.కాబట్టి వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల కింద, పాతబడిన తాత్కాలిక షెడ్ల కింద, కరెంట్ స్తంభాల పక్కన నిలబడకూడదని విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరించింది. ఎండల నుండి తాత్కాలిక ఉపశమనం లభించినప్పటికీ, ఈదురుగాలుల వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా రైతులు తమ ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని సూచించారు.

తెలంగాణను వణికిస్తున్న ఈ వేసవి విపత్తు నేపథ్యంలో ప్రజలు స్వీయ రక్షణ చర్యలు పాటించడం అత్యంత ఆవశ్యకమని వైద్య నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్న పిల్లలు మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లలోనే ఉండాలి.బయటకు వెళ్లాల్సి వస్తే తెల్లటి కాటన్ దుస్తులు ధరించడం, తలకు టోపీ లేదా గొడుగు వాడడం, ఎల్లప్పుడూ మంచినీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు తాగుతూ శరీరాన్ని తేమగా ఉంచుకోవడం ద్వారా వడదెబ్బ ముప్పు నుండి తప్పించుకోవచ్చని వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. వాతావరణంలో వచ్చే మార్పులను గమనిస్తూ అధికారులు ఇచ్చే సూచనలను పాటించడం ద్వారా ఈ వేసవి గండం నుండి సురక్షితంగా బయటపడవచ్చు.



# మావోయిస్టు అగ్రనేత నరహరి దంపతుల లొంగుబాటు

**మొదటిపేజీ తరువాయి**

ఈ దంపతులు చట్టం ముందు మోకరిల్లారు. అనంతరం వీరిని పోలీసులు అధికారికంగా మీడియా ముందుకు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున ప్రకటించిన ప్రత్యేక నక్సలైట్ల పునరావాస ప్యాకేజీ కింద పసునూరి నరహరికి రూ. 25 లక్షలు, ఆయన భార్య ధనమ్మకు రూ. 20 లక్షల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను డీజీపీ చేతుల మీదుగా అందజేశారు.

**విద్యార్థి దశ నుండి దండకారణ్యం వైపు**

ఈ లొంగుబాటు సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్ యొక్క సుదీర్ఘ విప్లవ ప్రస్థానాన్ని వివరించారు. హన్మకొండ జిల్లా కాజీపేట మండలానికి చెందిన సోమిడి గ్రామంలో 1962లో నరహరి జన్మించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లోనే ఆయన పదో తరగతి వరకు విద్యాభ్యాసం పూర్తి చేశారు. ఆ తర్వాత హన్మకొండలోని ప్రసిద్ధ ఎల్బీ డిగ్రీ కాలేజీలో ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ చదువుతున్న రోజుల్లో, అప్పట్లో క్రియాశీలకంగా ఉన్న ర్యాడికల్ స్టూడెంట్స్ యూనియన్ నాయకులతో నరహరికి పరిచయం ఏర్పడింది. ఆ సిద్ధాంతాల వైపు ఆకర్షితుడైన ఆయన చదువును మధ్యలోనే వదిలేసి అజ్ఞాతంలోకి వెళ్లారు. మావోయిస్టు పార్టీలో చేరిన కొత్తలో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా కుంట దళంలో సాధారణ సభ్యుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, ఆ తర్వాత గోపన్న దళం, రామన్న స్క్వాడ్‌లలో దండకారణ్యవ్యాప్తంగా చురుగ్గా పనిచేశారు. 1986లో హైదరాబాద్ సిటీ ఆర్గనైజర్‌గా, బెంగళూరులో రహస్య డెన్ కీపర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు.

**టెక్నికల్ వింగ్‌లో తిరుగులేని నిపుణుడు**

మావోయిస్టు పార్టీలో నరహరి కేవలం దళ నాయకుడిగా మాత్రమే కాకుండా, సాంకేతిక విభాగంలో (టెక్నికల్ వింగ్) నిపుణుడిగా గుర్తింపు పొందారు. సౌత్ బస్తర్ ప్రాంతంలో సుమారు 10 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ టెక్నికల్ టీమ్‌లో సప్లయ్ అండ్ ఆర్మ్స్ ఆర్గనైజర్‌గా సేవలందించారు. అత్యాధునిక ఫైర్ ఆర్మ్స్, దేశీయ మోటార్లు, రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్లు, బూబీ ట్రాప్‌లు, క్లేమోర్ మైన్స్ మరియు ల్యాండ్ మైన్స్ కోసం వాడే ఐఈడీలను తయారు చేయడంలో, వాటిని అనుసంధానించడంలో నరహరి అత్యంత నిపుణుడు. ఉద్యమంలోని వందలాది మంది కొత్త కేడర్‌కు ఆయనే స్వయంగా బాంబుల తయారీలో శిక్షణ ఇచ్చారని డీజీపీ తెలిపారు. పార్టీలో ఆయనకున్న అసాధారణ సాంకేతిక నైపుణ్యాన్ని గుర్తించిన అగ్రనాయకత్వం ఆయనకు రీజినల్ కమిటీ మెంబర్‌గా పదోన్నతి కల్పించి నాగ్‌పూర్‌కు పంపింది. ఆ తర్వాత 2005లో ఝార్ఖండ్‌కు, 2006లో బిహార్‌ఝార్ఖండ్ స్టేట్ కమిటీ మెంబర్‌గా బదిలీ చేసింది. 2017లో మావోయిస్టు ఈస్ట్రన్ సెంట్రల్ బ్యూరో ఆయన్ను అత్యున్నతమైన కేంద్ర కమిటీ సభ్యుడిగా నియమించింది. ఝార్ఖండ్‌లోని కోల్హాన్ ఏరియాలో స్టేట్ మిలటరీ కమిటీ మెంబర్‌గా, మూడేళ్ల పాటు టెక్నికల్ హెడ్‌గా పని చేసిన ఆయన, ఇటీవల కాలంలో వయసు పైబడటం మరియు తీవ్ర అనారోగ్య సమస్యల కారణంగానే జనజీవన స్రవంతిలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు డీజీపీ వివరించారు.

**భార్య ధనమ్మ సుదీర్ఘ పోరాటం**

పసునూరి నరహరి భార్య మెడారి ధనమ్మ అలియాస్ లత ప్రస్థానం కూడా తక్కువదేమీ కాదు. గుంటూరు జిల్లా దాచెపల్లి మండలం గాములపాడు గ్రామానికి చెందిన ఈమె, 1988లో నరహరిని వివాహం చేసుకున్నారు. పెళ్లయిన నాటి నుంచి భర్త అడుగుజాడల్లోనే నడుస్తూ విప్లవోద్యమంలో కీలక పాత్ర పోషించారు. 2004లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్ పోలీసులు ఆమెను నిఘా ఆధారంగా అరెస్ట్ చేశారు.దీనితో ఆమె ఏడేళ్ల పాటు సెంట్రల్ జైలులో కఠిన శిక్ష అనుభవించారు. 2011లో బెయిల్‌పై జైలు నుండి బయటకు వచ్చినప్పటికీ, సాధారణ జీవితం గడపడానికి ఇష్టపడక, మళ్లీ పోలీసుల కళ్లు గప్పి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. 2018 నుంచి బిహార్, ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీలో ఉంటూ మావోయిస్టు టెక్నికల్ టీమ్‌కు గట్టి సపోర్ట్ అందించారు. ఆ ప్రాంతంలో స్టేట్ కమిటీ మెంబర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ పోలీసులకు సవాల్‌గా మారారు.

**దేశంలో తగ్గిన మావోయిస్టుల ప్రభావం**

తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టుల ఏరివేత వ్యూహాలు మరియు లొంగుబాట్ల ప్రోత్సాహక కార్యక్రమాలు అత్యంత విజయవంతంగా సాగుతున్నాయని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. గత రెండేళ్లుగా (2024 నుంచి ఇప్పటివరకు) రాష్ట్రంలో వివిధ క్యాడర్లకు చెందిన మొత్తం 822 మంది మావోయిస్టులు ఆయుధాలు వీడి చట్టం ముందు లొంగిపోయారని వెల్లడించారు. లొంగిపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నిబంధనల ప్రకారం పునరావాసం కల్పిస్తూ ఆర్థిక భరోసా ఇస్తోందని, అందుకే చాలా మంది బయటకు వస్తున్నారని పేర్కొన్నారు.ఇప్పటివరకు మావోయిస్టుల దాడులను తిప్పికొడుతూ వారి నుంచి 334 అత్యాధునిక ఆయుధాలను రికవరీ చేసినట్లు తెలిపారు. ఇటీవలే ఝార్ఖండ్‌లో 15 మంది, ఇవాళ ఇద్దరు అగ్రనేతల లొంగుబాటు తర్వాత.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కేవలం 47 మంది మావోయిస్టులు మాత్రమే అజ్ఞాతంలో మిగిలి ఉన్నారని డీజీపీ సంచలన గణాంకాలను వెల్లడించారు. అందులో ఛత్తీస్‌గఢ్‌లో 15 మంది, ఒరిస్సాలో 15 మంది, ఝార్ఖండ్‌లో 13 మంది, తెలంగాణలో ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కరు మాత్రమే మిగిలి ఉన్నారన్నారు.

**అగ్రనేత గణపతికి పోలీసుల పిలుపు**

తెలంగాణ రాష్ట్ర సరిహద్దులు మరియు అడవులకు సంబంధించి ప్రస్తుతం కేవలం ముగ్గురు మాత్రమే అజ్ఞాతంలో మిగిలి ఉన్నారని డీజీపీ తెలిపారు. వారిలో మావోయిస్టు పార్టీ మాజీ సెక్రటరీ జనరల్, అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి, ఆయన భార్య జోడె రత్నాబాయి, మరియు వార్త శేఖర్ మాత్రమే ఉన్నారని స్పష్టం చేశారు.ప్రస్తుతం వీరంతా తీవ్ర వయోభారంతో పాటు వివిధ రకాల దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో అడవుల్లో నానా అవస్థలు పడుతున్నట్లు పోలీసులకు నమ్మదగిన సమాచారం ఉందని డీజీపీ పేర్కొన్నారు. ఇప్పటికైనా కాలం మించిపోలేదని, వారు కూడా ఆయుధాలు వీడి తక్షణమే జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. వారు గనుక లొంగిపోతే తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్ తరపున మానవతా దృక్పథంతో అత్యుత్తమ కార్పొరేట్ వైద్యం అందిస్తామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి పునరావాసం కల్పించి ప్రశాంతమైన జీవితానికి భరోసా ఇస్తామని డీజీపీ సీవీ ఆనంద్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌తో ప్రొఫెసర్ నాగేశ్వర్ భేటీ

**మొదటిపేజీ తరువాయి**

ఏపీ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని నాగేశ్వర్ స్పష్టంగా తెలిపారు. ఇటీవల తనపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆయన పేర్కొన్నారు.

ఇటీవల ఓ టీవీ చానెల్‌లో జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీలో పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఆయనను అరెస్టు చేసేందుకు ఏపీ పోలీసులు తెలంగాణకు వెళ్లారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా సాగింది.

అయితే ఈ ప్రచారాన్ని ఏపీ ప్రభుత్వం ఖండించింది. నాగేశ్వర్ అరెస్టు కోసం పోలీసులు తెలంగాణకు వచ్చినట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ వ్యవహారం పూర్తిగా తప్పుడు ప్రచారమేనని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ నాగేశ్వర్ డీజీపీని కలిసి తనపై జరుగుతున్న వదంతులపై చర్యలు తీసుకోవాలని కోరడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# గుట్టపక్క తండాలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

- **120 గ్రాముల గంజాయి స్వాధీనం, బోథ్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు.**
- **28 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు తనిఖీ.**
- **నంబర్ ప్లేట్ లేని 4 బైకులు స్వాధీనం.**
- **15 పెండింగ్ చలానాల ద్వారా రూ.16,750 వసూళ్లు.**
- **అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం.**
- **ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం.**
- **ఏఆర్ డిఎస్పి కమతం ఇంద్ర వర్ధన్**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 26 (డి డి 9 న్యూస్ ):-**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోనాల మండలం గుట్టపక్క తండా గ్రామంలో మంగళవారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని ఏఆర్ డిఎస్పి కమతం ఇంద్ర వర్ధన్ ఆధ్వర్యంలో బోథ్ సిఐ డి గురుస్వామి, ఎస్ఐ వి పురుషోత్తం సమక్షంలో విస్తృతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం 06:00 గంటల నుండి 09:00 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసిందని వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో వాహనాల తనిఖీలు చేపట్టగా 2 ఆటోలు, 28 ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. అందులో నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న 4 బైకులను గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా నార్కోటిక్ జాగిలం రోమా తనిఖీలు నిర్వహించగా అందులో రాథోడ్నియాల్సింగనే నిందితుడి వద్ద నుండి 120 గ్రాముల గంజాయిని జాగిలను గుర్తించింది, వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని, బోథ్ పోలీస్ స్టేషన్లో చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ఇక ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి పెండింగ్ లో ఉన్న 15 వాహనాల చలానాల ద్వారా రూ.16,750 జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం ఇలాంటి కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాహనాలకు సరైన పత్రాలు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామ ప్రజలు పోలీసులకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఇంద్రవర్ధన్, బోథ్ సీఐ గురుస్వామి ఆధ్వర్యంలో బోథ్ ఎస్ఐ పురుషోత్తం, నేరడిగొండ, బజార్ హత్నూర్ పోలీస్ స్టేషన్ ఎస్సైలు, క్యుఆర్టీ, సివిల్ హెడ్ కానిస్టేబుళ్లు, బీడీ బృందం పాల్గొన్నారు.







## ఏపిపి శ్రీధర్ గారికి బోథ్ బార్ అసోసియేషన్ ఆత్మీయ సన్మానం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 26 (డి డి 9 న్యూస్ ):-**

బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గత నాలుగు సంవత్సరాలనుండి ఏపిపి గా పని చేసి బదిలీపై భద్రాచలం కోర్టు కు వెళ్తున్న సందర్భంగా ఈరోజు కోర్టు ప్రాంగణంలో బోథ్ ఏపిపి శ్రీధర్ గారికి బోథ్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ విడుకోలు సన్మాన కార్యక్రమనికి ముఖ్య అతితిగా బోథ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కుంభ సందీప్ ముఖ్య అతితిగా హాజరై ఏపిపి గారిని శాలువాతో సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా బదిలీలు సర్వసధారణం కానీ ఎక్కడ ఉన్న బాధితులకు న్యాయం చేయడంలో రాజీ పడకూడదని బోథ్ లాంటి బార్ లో పని చేసినట్టే ఇతర కోర్టు న్యాయవాదులతో మంచి సత్సంబంధాలు కలిగి ఉండాలని జీవితంలో ఇంకా ఉన్నత స్థాయికి చేరాలని తెలిపారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ ఠాకూర్ రూపేందర్ సింగ్ ఏజిపి పంద్రం శంకర్ ట్రెజరర్ కుమ్మరి విజయ్ కుమార్ న్యాయవాదులు కే సుభాష్ అంగద్ ఆడెపు హరీష్ జమీర్ మహేష్ సందేశ్ తదితరులు పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్

- **అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తా - ఆడే గజేందర్**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 26 (డి డి 9 న్యూస్ ):-**

నేడు నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ గారు వివిధ మండలాలకు చెందిన లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 16 మందికి రూ.5,34,800/ మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా నేరడిగొండ మండలానికి చెందిన సయ్యద్ రజిఒద్దీన్‌కు రూ.25,500/, చొపడే శిల్పకు రూ.17,500/, సింధం లక్ష్మీకి రూ.44,000/, నజ్రిన్‌కు రూ.18,500/, లక్కవతుల గంగమణికి రూ.41,500/ , అత్తం లక్ష్మీకి రూ.15,000/, కైలాస బాయికి రూ.14,000/, భూమగౌడ్‌కు రూ.45,500/, కట్కం లక్ష్మీకి రూ.29,500/, జ్ఞానేశ్వర్‌కు రూ.28,500/ చెక్కులు అందజేశారు అలాగే ఇచ్చోడ మండలానికి చెందిన మడవి శ్రీకాంత్‌కు రూ.40,000/, మల్లేష్‌కు రూ.30,000/,బోథ్ మండలానికి చెందిన సగ్గిడి రంజిత్‌కు రూ.60,000/ , బజార్ హత్నూర్ మండలానికి చెందిన దివ్య జ్యోతికి రూ.22,500/, భీంపూర్ మండలానికి చెందిన రమేష్‌కు రూ.55,000/ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు ఈ సందర్భంగా ఆడే గజేందర్ గారు మాట్లాడుతూ పేద ప్రజలకు అత్యవసర సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ ఈ కార్యక్రమంలో సిరికొండ మండల సర్పంచ్లు సంఘం అధ్యక్షుడు బొడ్డు దత్తత్రి, కుమారి పాక్స్ చైర్మన్ మందుల రమేష్,బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఏలేటి మోహన్ రెడ్డి, బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీరామోజీ నారాయణ, ఆత్రం నగేష్, మాజీ బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్, టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర కన్వీనర్ అనుపట్ల సంజీవ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, బ్లాక్ ఆత్మ డైరెక్టర్ అందు సింగ్,బోథ్ నియోజకవర్గ మాజీ అధికార ప్రతినిధి యండి సద్దాం,మండల ఎస్సీ సెల్ అధ్యకులు ఏరెకరీ ఆడేళ్లు,చంద్ర విఠల్ తదితరులు ఉన్నారు





## రూ. 10 లక్షలతో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమిపూజ

**నిజామాబాద్ జిల్లా, మే 26(డీడీ9 వార్త) :**

మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అందులో భాగంగానే మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి నిధులు కేటాయిస్తోందని మండల పరిషత్తు అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్, సర్పంచ్ కుంట లక్ష్మి రమేష్ పేర్కొన్నారు. భీమ్‌గల్ మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షల నిధులతో మంజూరైన 'మహిళా సమాఖ్య2' భవన నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను కోరారు. అనంతరం సర్పంచ్ కుంట లక్ష్మి రమేష్ మాట్లాడుతూ.. భీమ్‌గల్‌లో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళల కోసం అనేక రకాల సంక్షేమ పథకాలను అందిస్తోందని, మహిళలంతా వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేశ్వర్ గౌడ్, నాయకులు పల్లె శేఖర్, మెడికల్ సత్యం, పల్లికొండ నరేందర్, శేరి లింబన్న, వార్డు సభ్యులు సంతోష్, షేఫీ, బాలరాజు, పల్లె రాము, బాజిరెడ్డి అభిలాష్, సప్పాలా నారాయణ పాల్గొన్నారు. అలాగే ఐకేపీ సీసీ రఘు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, కారోబార్ భోజన్న మరియు గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.


## నార్కోటిక్ జాగిలం "రోమా" సహాయంతో గంజాయి స్వాధీనం.

- **120 గ్రాముల గంజాయి పట్టివేత.**
- **నిందితుడు రాథోడ్ న్యాల్ సింగ్ పై కేసు నమోదు.**
- **మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు.**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 26 (డి డి 9 న్యూస్ ):-**

జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. బోథ్ మండలంలోని గుట్టపాక్క తండా గ్రామంలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమంలో నార్కోటిక్ జాగిలం "రోమా" సహాయంతో తనిఖీలు నిర్వహించగా 120 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు వెల్లడించారు.

జాగిలం రోమా అనుమానాస్పద ప్రాంతాలను పరిశీలిస్తూ తనిఖీలు నిర్వహించగా నిందితుడు రాథోడ్ న్యాల్ సింగ్ వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితుడిపై సంబంధిత సెక్షన్ల కింద బోథ్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ యువత



మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల విక్రయం, రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఇంద్రవర్ధన్, బోథ్ సీఐ గురుస్వామి, బోథ్, నేరడిగొండ, బజార్ హత్నూర్ ఎస్సైలు, క్యుఆర్టీ ఫోర్స్, సివిల్ సిబ్బంది, బీడీ టీం తదితరులు పాల్గొన్నారు.

## టీజీఆర్‌జేసీ, పాలీసెట్ ఎంట్రెన్స్ ఫలితాలలో 'వారాహి అకాడమీ' ప్రభంజనం

**నిజామాబాద్ జిల్లా, మే 26(డీడీ9 వార్త) :**

టీజీఆర్‌జేసీ, పాలీసెట్ ఎంట్రెన్స్ పరీక్షల ఫలితాలలో భీమ్‌గల్‌కు చెందిన వారాహి అకాడమీ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులతో ఘనవిజయం సాధించి రికార్డు సృష్టించారు. అకాడమీకి చెందిన కర్నాల శ్రీ వర్ధన్ టీజీఆర్‌జేసీలో రాష్ట్రస్థాయిలో 86వ ర్యాంకు, పాలీసెట్‌లో 1265వ ర్యాంకు సాధించి ద్వంద్వ ప్రతిభ కనబరిచాడు. టీజీఆర్‌జేసీ ఫలితాలలో ఈర్ల రిశాంత్ 445వ ర్యాంకు సాధించగా, పాలీసెట్ ఫలితాలలో పడాల నందిత శ్రీ రాష్ట్రస్థాయిలో 2719వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాప్ ర్యాంకులు సాధించి భీమ్‌గల్ ప్రాంతానికి పేరు తెచ్చిన విద్యార్థులను భీమ్‌గల్ మున్సిపాలిటీ చైర్మన్ బొదిరె నాగమణి స్వామి, వైస్ చైర్మన్ సంటి లత నర్సయ్యలు ప్రత్యేకంగా అభినందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత విద్యార్థులు కష్టపడి చదివి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం అభినందనీయమని, ఇది భీమ్‌గల్ ప్రాంతానికి ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులను ఇంతటి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన వారాహి అకాడమీ యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను మరియు విద్యార్థుల తల్లిదండ్రులను వారు ఈ సందర్భంగా కొనియాడారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సన్మాన కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ఇచ్చోడ మార్కెట్ యార్డ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 26 (డి డి 9 న్యూస్ ):-**

పంట కొనుగోళ్లతో పాటు గోదాంలకు తరలించే రవాణా ప్రకియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలన చేశారు.

ఈ సందర్భంగా మార్కెట్‌కు వస్తున్న పంట దిగుబడులు, ప్రస్తుత కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సేవలపై ఆయన అక్కడి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యార్డ్‌లో జరుగుతున్న వివిధ పనుల పురోగతిని స్వయంగా అడిగి తెలుసుకున్న కలెక్టర్, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మార్కెట్ యార్డ్‌కు పంటను తీసుకువచ్చే రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులను ఆదేశించారు. పంట కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, తూకాల్లో ఎలాంటి వ్యత్యాసాలు రాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, కొనుగోలు చేసిన పంటను సకాలంలో గిడ్డంగులకు తరలించేలా రవాణా చర్యలు వేగవంతం చేయాలని, రైతులకు చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

ఈ తనిఖీలో మండల ప్రత్యేక అధికారి రామారావు తహసీల్దార్ ఇమ్రాన్, పాక్స్ చైర్మన్ A. శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ జె.జకు,స్థానిక మార్కెట్, రెవెన్యూ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపవద్దు

- **బషీరాబాద్ ఐటీఐ ప్రాంగణంలో 'మన ఊరు - మన భద్రత'**

**నిజామాబాద్ జిల్లా, మే 26(డీడీ9 వార్త) :**

మత్తు పదార్థాలను సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాలకే ప్రమాదమని ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని హెడ్ కానిస్టేబుల్ మధుకర్ అన్నారు. కమ్మర్‌పల్లి మండల పోలీస్ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో బషీరాబాద్ గ్రామం శివారులోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో 'మన ఊరు మన భద్రత' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మితిమీరిన వేగం, అజాగ్రత్త డ్రైవింగ్ వల్ల జరిగే నష్టాలను గ్రామ ప్రజలకు, హమాలీ కూలీలకు వివరించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు నిరంతరం పనిచేస్తున్నారని, ప్రజలు కూడా చట్టాలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, హమాలీ కూలీలతో పాటు పోలీసు సిబ్బంది కానిస్టేబుళ్లు మహిపాల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.






## ఈద్గా ప్రాంగణాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ నాగమణి

**నిజామాబాద్ జిల్లా, మే 26(డీడీ9 వార్త) :**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్లుండి జరగనున్న ముస్లింల పవిత్ర బక్రీద్ పండుగను పురస్కరించుకొని భీమ్‌గల్ పట్టణంలోని బాపూజీ నగర్‌లో గల ఈద్గా మైదానాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డి.గజానంద్ మాట్లాడుతూ.. ముస్లిం సోదరులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా మున్సిపాలిటీ తరఫున అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రార్థనా స్థలంలో టెంట్లు, మ్యాట్లు, కుర్చీలతో పాటు తాగునీటి సౌకర్యం మరియు సౌండ్ సిస్టం వంటి ఏర్పాట్లను మున్సిపల్ శాఖ పర్యవేక్షణలో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈద్గా మైదానంలో జరుగుతున్న పనులను పరిశీలించిన చైర్‌పర్సన్ నాగమణి, పండుగ సమయానికి అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు జై జై నర్సయ్య, అంజు ఆలీ, తోట సతీష్, నీలం రవి, మున్సిపల్ సిబ్బంది, మైనార్టీ పెద్దలు తదితరులు vపాల్గొన్నారు






## విదేశీ వాణిజ్యాన్ని అందిపుచ్చుకునేలా రైతులకు తోడ్పాటునందించాలి

- **కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్ జిల్లా, మే 26(డీడీ9 వార్త) :**

వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లా రైతాంగానికి మరింత ప్రయోజనం కలిగేలా వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా తగిన తోడ్పాటును అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను కోరారు. స్థానిక సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఏపీఈడీఏ, జాతీయ పసుపు బోర్డు, నాబార్డు, ఇండియా పోస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం' ఘనంగా నిర్వహించారు. నూతన ఎగుమతిదారులను ప్రోత్సహించడం, ఎంఎస్ఎమ్ఈల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, జిల్లా స్థాయిలో ఎగుమతులను గణనీయంగా పెంపొందించడమే లక్ష్యంగా ఈ సదస్సు సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈకామర్స్ ఎగుమతుల ప్రదర్శన, ట్రేడ్ కనెక్ట్ పోర్టల్, పసుపు, వరి, సోయాబీన్, మొక్కజొన్న, పత్తి పంటల మార్కెట్ వైవిధ్యీకరణ అంశాలపై డీజీఎఫ్‌టీ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు సమగ్ర అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ... నిజామాబాద్ జిల్లా రైతాంగం సేద్యపు రంగంలో ఆధునిక విధానాలు, శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తూ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ముఖ్యంగా ఆర్మూర్ ప్రాంత రైతులు అత్యధిక విస్తీర్ణంలో పసుపు సాగు చేస్తారని, అంకాపూర్ రైతులు నూతన వంగడాల విషయంలో అందరికీ ఆదర్శంగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో పురాతన, సంప్రదాయ పద్ధతుల స్థానంలో ఆధునిక సాగు విధానాలను తెలియజేయడం, కూలీల కొరతను అధిగమించేందుకు యంత్రీకరణను వినియోగించడం, మార్కెటింగ్ మెలుకువలు మరియు పసుపు పంట నాణ్యతను పెంపొందించే ప్రాసెసింగ్ విధానాలపై తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. నిజామాబాద్ జిల్లాను ఎగుమతి కేంద్రంగా ప్రకటిస్తూ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఈ మెగా కార్యక్రమాన్ని నిర్వహించడం ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డీజీఎఫ్‌టీ ప్రాంతీయ సంచాలకులు ఎస్.ఎ. చవాన్ మాట్లాడుతూ... రైతులు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని, అప్పుడే వారికి గణనీయమైన లాభాలు సమకూరడంతో పాటు దేశానికి విదేశీ మారకద్రవ్యం పెరిగి రూపాయి విలువ బలపడుతుందని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ నుండి ఔషధాలు, ఇంజినీరింగ్ విడి భాగాలు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయని, ఇదే కోవలో పసుపు, వరి వంటి వ్యవసాయ ఉత్పత్తులను కూడా అధిక మొత్తంలో ఎగుమతి చేయవచ్చని వివరించారు. ఫారిన్ ట్రేడ్ పాలసీని అనుసరిస్తూ విదేశీ ఎగుమతులకు ప్రభుత్వం తగిన రాయితీలు ఇస్తూ ప్రోత్సహిస్తోందని, నేటి పరిస్థితుల్లో ఈకామర్స్ ప్రాధాన్యతను గుర్తెరిగి రైతులు అంతర్జాతీయ వ్యాపార లావాదేవీలు జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు అధికారులు కేవీఎస్. శైలజ, ప్రత్యూష్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు విద్య, కే.జనార్ధన్ రెడ్డి, ఏపీఈడీఏ అధికారి నాయుడు, నాబార్డు డీజీఎం ఎస్. ప్రవీణ్ కుమార్, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ట్రేడర్లు మరియు రైతులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నిజామాబాద్ జిల్లా, మే 26(డీడీ9 వార్త) :**

కార్పొరేట్ కళాశాలల్లో 202627 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రవేశాల కొరకు జిల్లాకు చెందిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు దివ్యాంగుల విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షలలో 7.0 సిజిపిఏ లేదా 400 మార్కులు ఆ పైన సాధించిన విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు జూన్ 5వ తేదీ వరకు తెలంగాణ ఈపాస్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చని స్పష్టం చేశారు. ఈ ఎంపిక ప్రక్రియ పూర్తిగా పదో తరగతి మెరిట్ ఆధారంగా ఆటోమేటిక్ సిస్టమ్ ద్వారా జరుగుతుందని, ఎంపికైన విద్యార్థుల సమాచారాన్ని వారి మొబైల్ నెంబర్లకు మెసేజ్ ద్వారా మాత్రమే పంపించడం జరుగుతుందని వివరించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మీ సేవా ద్వారా పొందిన ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడి, ఎస్ఎస్ఎల్సి మార్కుల మెమో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు మరియు 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు తెలంగాణలోనే చదివినట్లు స్టడీ సర్టిఫికెట్లను జతపరచాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు హాస్టల్ బోనఫైడ్ సర్టిఫికెట్ సమర్పించాలని, బీఏఎస్, హెచ్‌పీఎస్ మరియు సీబీఎస్ఈ విద్యార్థులు సంబంధిత జిల్లా అధికారి ద్వారా తమ వివరాలను నమోదు లేదా మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఇదొక మంచి అవకాశమని, అర్హులైన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి కోరారు.

# బోథ్ పోలీస్ స్టేషన్ పరిశీలన

- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**
- **సిబ్బంది విధులలో నీతి నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన పాటించాలి.**
- **ప్రజా సమస్యలను విపిఓ ద్వారా పరిష్కరించేలా చేయాలి.**
- **మండలంలో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలి**
- **మండలంలో ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా చర్యలు చేపట్టాలి.**
- **గంజాయి, గుడుంబా, రాయితీ బియ్యం, పశువుల అక్రమ రవాణా పై దృష్టి సారించాలి.**
- **రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని సూచన.**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 26 (డి డి 9 న్యూస్ ):-**

సిబ్బంది విధులలో క్రమశిక్షణ, సమయపాలన, నీతి నిజాయితీతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ రోజు బోథ్ పోలీస్ స్టేషన్ ను పరిశీలించడం జరిగింది. మొదటగా పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాల ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని తెలిపారు. విపిఓ విధానాన్ని అమలు చేస్తూ గ్రామస్థాయిలో జరిగే ప్రతి అసాంఘిక కార్యకలాపాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలని, సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మండల పరిధిలో గంజాయి లేకుండా గంజాయి రహిత జిల్లా ఏర్పాటుకు కృషి చేయాలని అదేవిధంగా గుడుంబా లేకుండా, ప్రభుత్వ రాహితీ బియ్యం అక్రమంగా తరలకుండా, పశువుల రవాణా జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, మండలంలో ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు. పెండింగ్ కేసులు పూర్తి చేసి చార్జిషీట్‌లు దాఖలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, బోథ్ సిఐ డి గురుస్వామి, బోథ్





ఎస్ఐ వి పురుషోత్తం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పైలెట్ డే ను ఘనంగా జరుపుకున్న 108 సిబ్బంది

**నిజామాబాద్ కోటగిరి పోతంగల్ మే26 (డిడి9 వార్త):**

నిజామబాద్ జిల్లా లోని 108 ఆఫీసులో ఘనంగా పైలెట్ డే జరుపుకున్నారు. మంగళవారం రోజున 108 సిబ్బందిని పైలెట్ డే సందర్భంగా 108 రథసారధిగా నడిపే డ్రైవర్ని పైలెట్ అని కూడా పిలుస్తారని దీని ద్వారా అంబులెన్స్ను మరియు 108 రోగులను కంటికి రెప్పలా కాపాడే పైలెట్ గా గుర్తించి ఆయన సక్రమంగా 108 ని ఇన్ టైం లో తీసుకెళ్లడం వల్ల ప్రాణాలను కాపాడుకోగలుగుతారు. ఒక కుటుంబానికి పెద్దలు ఎంత అవసరమో అంబులెన్స్ కి పైలెట్ కూడా అంతే అవసరం. ఎలాంటి ఎమర్జెన్సీ కేసెస్ వచ్చిన సకాలంలో హాస్పిటల్ కి చేర్చడం పైలెట్ కి కీలకమైన ఛాలెంజ్ లాగా ఉంటుంది. ఎలాంటి ఆలోచనలను లెక్కచేయకుండా ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా ఎంచుకొని రోడ్డుపై ధైర్యంగా తీసుకెళ్లేవాడే పైలెట్ గుర్తిస్తారు. ఒక అంబులెన్స్ కి ఒక టెక్నీషియన్ ఒక పైలెట్ ఎంత అవసరమో పైలెట్ డే సందర్భంగా పైలెట్ సేవలను గుర్తించి వారి సేవలను మర్చిపోలేమని ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్ పేర్కొన్నారు. పైలెట్ లేనిదే అంబులెన్స్ లేదని నిజామబాద్ ఎమర్జెన్సీ సూపర్వైజర్ స్వరాజ్ పేర్కొన్నారు. టెక్నీషియన్స్ అంబులెన్స్ కి పైలెట్ ఎంత అవసరమో వారి యొక్క ఉపయోగాలు గుర్తించి ఒక రోజును పైలట్ గా సేవలను గుర్తించి పైలెట్ డే ను జరుపుకోవడం జరిగింది. వారి సేవలను మర్చిపోలేని ఒక అనుభూతి రథసారధి లాగా నడిపే పైలెట్ ను ఒక దేవుడు లాగా గుర్తించి ప్రాణాలు రక్షించే పైలేటును ఒక దేవుడు లాగా భావించవచ్చని ప్రతి ఒక్క ఎమర్జెన్సీ కేసును సకాలంలో ఆసుపత్రికి చేర్చడంలో కీలకమైన పాత్ర పైలట్ ఉంటుందని వారి సేవలు గుర్తించి వారికి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పైలట్ సంతోష్ రెడ్డి ఎమర్జెన్సీ టెక్నీషియన్స్ ఇద్దరు కూడా రెండు కళ్ళ జోడు లాగా పని చేస్తేనే అంబులెన్స్ అనేది నడుస్తుంది.



## కల్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కురుమల ఆరాధ్య దైవం శ్రీ బీరప్ప స్వామి దేవాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

**నిజామాబాద్ పోతంగల్ మే 26(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం లోని కల్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన కురుమల ఆరాధ్య దైవం శ్రీ బీరప్ప స్వామి దేవాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవం అనంతరం జరిగిన శ్రీ బీరప్ప స్వామి వారి కళ్యాణ మహో



ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## పోతంగల్ మండల కేంద్రంలో మహిళ సంఘం భూమి పూజ కార్యక్రమం

**నిజామాబాద్ పోతంగల్ మే 26 (డిడి9వార్త):**

నిజామాబాద్ జిల్లా, పోతంగల్ మండల కేంద్రంలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే మహిళ ఇందిరమ్మ భవనాల నిర్మాణంలో భాగంగా పొతంగల్ మండల కేంద్రంలో మహిళ సంఘం భూమి పూజ చేయడం జరిగింది. గ్రామ సర్పంచ్ కల్లూరు సంధ్య మాట్లాడుతూ గ్రామంలో ఉన్న డ్వాక్రా మహిళల సమావేశం కొరకు మహిళ భవన సంఘం నిర్మిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోతంగల్ గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, ఉప సర్పంచ్ నబి, గ్రామ సెక్రెటరీ యాదవ్, వివో ప్రెసిడెంట్ సునీత, కార్యదర్శి స్వప్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ కేశ వీరేశం, ధనరాజ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## పొతంగల్ గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో మూడో వార్డులో బోరు వేయడం జరిగింది

**నిజామాబాద్ పోతంగల్ మే 26 (డిడి9 వార్త):**
నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని మూడో వార్డులో ఎండల తీవ్రత ఎక్కువ ఉండడం వలన త్రాగు నీటి సమస్య ఏర్పడుతుందని గ్రామ సర్పంచ్ వెంటనే స్పందించి ఈరోజు బోర్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కల్లూరి సంధ్య బజరంగ్, ఉప సర్పంచ్ నబి, వార్డ్ మెంబర్లు పులకంటి సాయిలు, మరికల సంతోష్ పటేల్, గంధపు సంధ్య, మాజీ ఉపసర్పంచ్ సుదం వినోద్, గంధపు హనుమద్లు, గంధపు గంగల్త, ఒమన్న పటేల్, వడ్ల సంతోష్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## వివోఏ లా రెండో రోజు చేరుకున్న నిరవధిక సమ్మె ...

**నిజామాబాద్ కోటగిరి పోతంగల్ మే 26 (డిడి9 వార్త):**
నిజాంబాద్ జిల్లా కోటగిరి పోతంగల్ ఉమ్మడి మండలాల్లో వివో ఏ లకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి, సర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ వర్తింపు చేయాలి. అర్హులైన వివో వీళ్లకు సీసీలుగా పదోన్నతి కల్పించాలి. వివో ఏ లకు సాధారణ ఆరోగ్య భీమా సౌకర్యం 20 లక్షలు వరకు కనిపించాలి. టాప్ మరియు నెట్వర్క్ సౌకర్యం కల్పించాలి. 58వ జీవోను సవరించాలని ఉమ్మడి మండలాల వివోఏలు సమ్మెను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సాయిలు, ఉపాధ్యక్షులు శోభ, కార్యదర్శి , రాజు, కోశాధికారి రమేష్, సహకార కార్యదర్శి శిరీష, ఉమ్మడి మండలాల ఐకెపి సంఘం సహాయకులు పాల్గొన్నారు.




## కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ..

**నిజామాబాద్ కోటగిరి మే 26(డిడి9 వార్త):**
నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలోని దేవుని గుట్ట తండా గ్రామంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోటగిరి మండల కేంద్రంలోని దేవుని గుట్ట తండా ఏముల నవీన్ మాట్లాడుతూ కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతలో క్రిడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెరగడానికి క్రీడలు దోహదపడతాయని ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ బృందం,సీతారాం నాయక్, ఏముల నవీన్, పత్తి సతీష్ కప్ప సాయిలు హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఇన్‌స్టా నుంచి 200 పోస్టులు డిలీట్.. కోహ్లీతో రీల్ కూడా మాయం.. అర్ష్‌దీప్‌కు ఏమైంది?

- **ప్రకటనలు, కుటుంబ చిత్రాలు మినహా మిగతావన్నీ తొలగింపు**
- **విరాట్ కోహ్లీతో చేసిన వైరల్ రీల్ కూడా డిలీట్**
- **ఇటీవలి వివాదాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఊహాగానాలు**
- **ఐపీఎల్‌లో వైఫల్యం, విమర్శలతోనే సోషల్ మీడియాకు దూరమా?**



**డిడి9 వార్త:**
టీమిండియా యువ పేసర్, పంజాబ్ కింగ్స్ బౌలర్ అర్షదీప్ సింగ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి దాదాపు 200 పోస్టులు, రీల్స్‌ను ఒక్కసారిగా తొలగించి అభిమానులకు షాకిచ్చాడు. ఈ డిజిటల్ ప్రక్షాళన తర్వాత అతని ప్రొఫైల్‌లో కేవలం 44 పోస్టులు మాత్రమే మిగిలాయి. వీటిలో ఎక్కువ శాతం కుటుంబ చిత్రాలు, వాణిజ్య ప్రకటనలు, పెయిడ్ పార్ట్‌నర్‌షిప్ పోస్టులే ఉన్నాయి.
ఛాంపియన్స్ ట్రోఫీ 2025 వేడుకల సందర్భంగా విరాట్ కోహ్లీతో చేసిన వైరల్ రీల్‌తో పాటు అనేక వ్యక్తిగత పోస్టులు కూడా అదృశ్యమయ్యాయి. అయితే, ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్‌కు సంబంధించిన అన్ని పోస్టులను తొలగించాడంటూ వచ్చిన వార్తల్లో నిజం లేదు. పంజాబ్ జట్టు ఫొటోతో ఉన్న 'సబర్. షుకర్. పంజాబ్' అనే క్యాప్షన్ గల పోస్ట్ ఇంకా కనిపిస్తోంది. అయితే, ఈ చర్య వెనుక వ్యక్తిగత రీబ్రాండింగ్ ప్రయత్నం ఉందా? లేక ఇటీవలి వివాదాల నుంచి దూరంగా ఉండేందుకే ఇలా చేశాడా? అనే దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది.
ఐపీఎల్ 2026 సీజన్‌లో 27 ఏళ్ల అర్ష్‌దీప్ ప్రదర్శన అంతగా ఆకట్టుకోలేదు. 14 మ్యాచ్‌ల్లో 14 వికెట్లతో పంజాబ్ తరఫున టాప్ వికెట్ టేకర్‌గా నిలిచినప్పటికీ, జట్టు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. ఇదిలా ఉంటే.. ముంబై ఇండియన్స్ బ్యాటర్ తిలక్ వర్మను ఉద్దేశించి జాతి వివక్ష వ్యాఖ్యలు చేశాడనే ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. అలాగే, అతని వ్లాగ్‌లో యుజ్వేంద్ర చాహల్ ఈసిగరెట్ తాగుతున్నట్లు కనిపించడం కూడా వివాదాస్పదమైంది. ఈ పరిణామాల తర్వాతే అతను సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఐపీఎల్-2026 ఫైనల్లోకి దూసుకెళ్లిన ఆర్సీబీ... గుజరాత్ కు మరో చాన్స్

- **క్వాలిఫయర్-1లో గుజరాత్‌పై ఆర్సీబీ 92 పరుగుల భారీ విజయం**
- **ఐపీఎల్ 2026 ఫైనల్‌కు నేరుగా అర్హత సాధించిన బెంగళూరు**
- **33 బంతుల్లో 93 పరుగులు చేసి కెప్టెన్ రజత్ పటీదార్ విధ్వంసం**
- **గుజరాత్ తరఫున రాహుల్ తెవాటియా ఒంటరి పోరాటం**
- **ఓడినా గుజరాత్ టైటాన్స్‌కు ఫైనల్ చేరేందుకు మరో అవకాశం**



**డిడి9 వార్త:**
డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ 2026 సీజన్‌లో నేరుగా ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన క్వాలిఫయర్1 మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను 92 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించి టైటిల్ సమరానికి సిద్ధమైంది. కెప్టెన్ రజత్ పటీదార్ ఆడిన విధ్వంసకర ఇన్నింగ్స్ ఆర్సీబీ విజయంలో కీలకపాత్ర పోషించింది. మరోవైపు, ఈ మ్యాచ్‌లో ఓటమి పాలైనప్పటికీ గుజరాత్ టైటాన్స్‌కు ఫైనల్ చేరేందుకు మరో అవకాశం మిగిలి ఉంది. ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో ఆ జట్టు క్వాలిఫయర్2లో తలపడనుంది.
ధర్మశాల వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ బౌలింగ్ ఎంచుకోగా, ఆర్సీబీ బ్యాటర్లు పరుగుల వరద పారించారు. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోరు సాధించారు. వెంకటేశ్ అయ్యర్ (19) మెరుపు ఆరంభాన్ని ఇవ్వగా, విరాట్ కోహ్లీ (43), దేవదత్ పడిక్కల్ (30) కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే వీరిద్దరిని ఒకే ఓవర్లో పెవిలియన్ చేర్చి హోల్డర్ గుజరాత్‌కు కాస్త ఊరటనిచ్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రజత్ పాటిదార్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 33 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 93 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. కృనాల్ పాండ్య (43) కూడా రాణించడంతో ఆర్సీబీ భారీ స్కోరు చేసింది.
అనంతరం 255 పరుగుల కొండంత లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఆరంభంలోనే తడబడింది. సాయి సుదర్శన్ (14), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (2) త్వరగా ఔటయ్యారు. జోస్ బట్లర్ (29) వేగంగా ఆడే ప్రయత్నం చేసినా ఎక్కువసేపు నిలవలేదు. ఒక దశలో 51 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి గుజరాత్ పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ సమయంలో రాహుల్ తెవాటియా (68) ఒంటరి పోరాటం చేశాడు. 43 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో గుజరాత్ పరువు నిలిపే ప్రయత్నం చేశాడు. కానీ అతనికి ఇతర బ్యాటర్ల నుంచి సహకారం అందలేదు.
ఆర్సీబీ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో గుజరాత్ 19.3 ఓవర్లలో 162 పరుగులకే ఆలౌట్ అయింది. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ 3 వికెట్లు పడగొట్టగా.. భువనేశ్వర్ కుమార్, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ దార్ తలా రెండు వికెట్లు తీశారు.

# అది నా నిర్ణయం కాదు.. ఐపీఎల్‌కు దూరం కావడంపై బాంబు పేల్చిన ఆర్‌సీబీ పేసర్!

- **ఐపీఎల్ నుంచి తప్పుకోవడం తన వ్యక్తిగత నిర్ణయం కాదన్న యశ్ దయాల్**
- **ఈ నిర్ణయం ఆర్‌సీబీ యాజమాన్యమే తీసుకుందని సంచలన ఆరోపణ**
- **తనను జట్టు నుంచి తొలగించలేదని, రీటెయిన్ జాబితాలో ఉంచారని వెల్లడి**
- **లైంగిక ఆరోపణల కేసుల కారణంగానే దయాల్ ఆటకు దూరమైనట్లు సమాచారం**

**డిడి9 వార్త:**
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) పేసర్ యశ్ దయాల్.. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌కు తన గైర్హాజరీపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. టోర్నీ నుంచి తప్పుకోవడం తన వ్యక్తిగత నిర్ణయం కాదని, ఆర్‌సీబీ యాజమాన్యమే ఆ నిర్ణయం తీసుకుందని చెప్పి వివాదానికి తెరలేపాడు. సీజన్ ప్రారంభానికి ముందు ఆర్‌సీబీ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ మో బోబాట్ 'వ్యక్తిగత కారణాల' వల్ల దయాల్ ఆడటం లేదని ప్రకటించారు. అయితే, దీనికి భిన్నంగా యశ్ దయాల్ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.
ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన యశ్ దయాల్, తన గైర్హాజరీకి గల కారణాలను వివరించాడు. "నేను జట్టును చాలా మిస్ అవుతున్నాను. టీవీలో వాళ్లు ఆడుతుంటే చూడలేకపోతున్నాను. అయితే నన్ను జట్టు నుంచి తొలగించలేదు, రీటెయిన్ జాబితాలోనే ఉంచారు. నా స్థానంలో మరొకరిని తీసుకోలేదు. నేను జట్టుకు ముఖ్యమైన ఆటగాడినని వాళ్లు భావిస్తున్నారేమో. ఈ సీజన్ నుంచి తప్పుకోవడం నా వ్యక్తిగత నిర్ణయం కాదు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదం కావొచ్చు, కానీ నిర్ణయం ఎప్పుడూ యాజమాన్యానిదే. ఆర్‌సీబీ ఎందుకు ఈ నిర్ణయం తీసుకుందో నాకు తెలియదు" అని దయాల్ పేర్కొన్నాడు.
అదే సమయంలో ఆర్‌సీబీ యాజమాన్యంతో తాను నిరంతరం టచ్‌లోనే ఉన్నానని స్పష్టం చేశాడు. "నేను మేనేజ్‌మెంట్‌తో, డైరెక్టర్, కోచ్, దినేశ్ కార్తీక్‌తో మాట్లాడుతూనే ఉన్నాను. మా మధ్య ఎలాంటి కమ్యూనికేషన్ గ్యాప్ లేదు. అంతా స్పష్టంగానే ఉంది" అని తెలిపాడు.
కాగా, యశ్ దయాల్ ప్రస్తుతం తీవ్రమైన లైంగిక ఆరోపణలు, పోక్సో చట్టం కింద నమోదైన కేసులను ఎదుర్కొంటున్నాడు. ఈ న్యాయపరమైన చిక్కుల కారణంగానే అతను క్రికెట్‌కు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఫ్రాంచైజీ ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.





## చరణ్ ఫ్యాన్స్ కు గుడ్ న్యూస్.. 'పెద్ది' నుంచి రెండో ట్రైలర్ ?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ గా చేసిన సినిమా పెద్ది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో ఈ సినిమా వస్తోంది. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వస్తున్న ఈ మూవీలో రామ్ చరణ్ హీరోగా చేస్తుండగా, హీరోయిన్ గా జాన్వీ కపూర్ మెరువనున్నారు. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్.. గౌరనాయుడు అనే రోల్ చేస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీత స్వరాలు అందిస్తుండగా... వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రి మూవీ మేకర్స్ ఆధ్వర్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది.
అదే జూన్ 4వ తేదీన ఈ సినిమా రిలీజ్ కానుండగా ఇప్పటికే ట్రైలర్ లాంచ్ చేశారు. దీంతో సినిమాపై హైప్ అమాంతం పెరిగింది. అయితే సినిమా రిలీజ్ కు మరో వారం రోజుల సమయం ఉన్న నేపథ్యంలో.. జనాలకు మరింత దగ్గరగా పెద్ది సినిమాను తీసుకువెళ్లేందుకు చిత్ర బృందం ప్లానింగ్ చేస్తోంది. ఇందులో భాగంగానే రెండో ట్రైలర్ కూడా రిలీజ్ చేసేందుకు సిద్ధమవుతున్నారట. దీనిపై త్వరలోనే ప్రకటన కూడా రానున్నట్లు టాక్ నడుస్తోంది.

## 'రామాయణ' లోకి మరాఠీ నటుడి ఎంట్రీ..

ఇండియన్ సినీ హిస్టరీలోనే ఎన్నడూ లేనంత అత్యంత భారీ బడ్జెట్‌తో, విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ ఇండియన్ పీరియాడిక్ మైథలాజికల్ ఫిల్మ్ 'రామాయణ'. దర్శకుడు నితీష్ తివారీ ఈ ఇతిహాస గాథను వెండితెరపై ఒక అద్భుతంగా ఆవిష్కరిస్తున్నారు. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న.. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా.. నేచురల్ బ్యూటీ సాయి పల్లవి సీత పాత్రలో నటిస్తోంది. రాకింగ్ స్టార్ యష్ రావణాసురుడిగా చేస్తున్నారు.యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ హనుమంతుడిగా.. కాజల్ అగర్వాల్ మండోదరి పాత్రలో, టాలెంటెడ్ యాక్టర్ రవి దూబే లక్ష్మణుడుగా కనిపించనున్నారు. తాజాగా, మరాఠీ నటుడు ఆదినాథ్ కోఠారే ఇందులో భరతుడిగా నటిస్తున్నారు. మరాఠీ, హిందీ భాషల్లో నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆదినాథ్ కోఠారే ఇప్పుడు భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'రామాయణ' చిత్రంలో భాగం అయ్యారు.



ఈ విషయాన్ని ఆదినాథ్ కోఠారే వెల్లడిస్తూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై ఆదినాథ్ స్పందిస్తూ.. "భారతదేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సినిమాలో నటించే అవకాశం రావడం నా అదృష్టం. చుట్టూ వినిపించే అనవసరపు మాటలను నేను అస్సలు పట్టించుకోను. మన చేతిలో మంచి స్క్రిప్ట్ ఉన్నప్పుడు మరేదీ ముఖ్యం కాదు. రణబీర్ కపూర్ చాలా కష్టపడే, నిజాయితీ గల నటుడు. ఆయనతో కలిసి పనిచేయడం ఒక గొప్ప అనుభూతి" అని చెప్పారు. 'రామాయణం' సినిమాతో ఇండియన్ సినిమా నెక్స్ట్ లెవెల్‌కు వెళ్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక రెండు భాగాల్లో రాబోతున్న ఈ చిత్రం మొదటి పార్ట్ వచ్చే ఈ ఏడాది దీపావళికి, రెండవ భాగం వచ్చే ఏడాది దీపావళి కానుకగా విడుదల కానున్నాయి. ఈ రెండు భాగాలపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

## రిలీజ్ అయిన రెండేళ్లకు దేవర శాటిలైట్ రైట్స్ డీల్ క్లోజ్

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ నటించిన హైవోల్టేజ్ యాక్షన్ విజువల్ వండర్ 'దేవర: పార్ట్ 1' శాటిలైట్ హక్కులకు సంబంధించిన సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. థియేటర్లలో మరియు ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లలో సెన్సేషనల్ వ్యూయర్‌షిప్‌తో రికార్డులు సృష్టించిన ఈ చిత్రం.. ఇప్పుడు బుల్లితెరపై సందడి చేయడానికి సిద్ధమవుతోంది. టాలీవుడ్ ఇండస్ట్రీలో గత కొన్ని నెలలుగా ఆసక్తికరంగా మారిన 'దేవర' తెలుగు శాటిలైట్ రైట్స్ డీల్ క్లోజ్ అయింది.
తాజా సమాచారం ప్రకారం ప్రముఖ టెలివిజన్ నెట్‌వర్క్ ఈటీవీ 'దేవర' చిత్ర శాటిలైట్ హక్కులను భారీ ధరకు సొంతం చేసుకుంది. సాధారణంగా భారీ కమర్షియల్ మరియు యాక్షన్ ఓరియెంటెడ్ చిత్రాల కొనుగోలుకు కాస్త దూరంగా ఉండే ఈటీవీ ఈ పాన్‌ఇండియా బ్లాక్‌బస్టర్ సినిమా కోసం భారీ డీల్ కుదుర్చుకోవడం ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. డిజిటల్ రైట్స్ కొనుగోలు చేసిన నెట్ ఫ్లిక్స్ రెండేళ్ల పాటు ఈ సినిమాకు సంబంధించి అన్ని రైట్స్ తమకే చెందుతాయని ఒప్పందం నిబంధనల వల్లే ఇప్పటివరకు ఈ సినిమా శాటిలైట్ బిజినెస్ ఆలస్యమైంది. కొరటాల శివ దర్శకత్వంలో యంగ్ టైగర్ ఎన్టీఆర్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్, స్టార్ యాక్టర్ సైఫ్ అలీ ఖాన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ అందించిన మ్యూజిక్ మరియు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఎట్టకేలకు ఈటీవీ లాంటి భారీ నెట్‌వర్క్‌లో 'దేవర' టెలివిజన్ ప్రీమియర్‌కు రంగం సిద్ధం కావడంతో, బుల్లితెరపై తారక్ 'దేవర' తాండవం ఖాయమని, సరికొత్త టీఆర్పీ రికార్డులు నమోదు కావడం పక్కా అని అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## మంచు మనోజ్ మంచి మనసు.. అనాథాశ్రమాన్ని సందర్శించిన నటుడు

నటుడు మంచు మనోజ్ పెద్ద మనసు చాటుకున్నారు. అనాథాశ్రమం నిర్వాహకుల అభ్యర్థన మేరకు ఆశ్రమాన్ని సందర్శించారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో 'మాతృదేవోభవ' అనాథాశ్రమాన్ని సందర్శించి ఆయన అక్కడ మతిస్థిమితం సరిగ్గా లేని ఒక వ్యక్తికి నిర్వాహకులతో కలిసి హెయిర్ కటింగ్ చేశారు. అనంతరం కొత్త దుస్తులు ఇచ్చారు. ఆశ్రమానికి అవసరమైన టేబుళ్లు, కుర్చీలను విరాళంగా అందజేశారు.
సమాజంలో ఎవరూ లేనివారికి అండగా నిలవడం గొప్ప విషయమని మనోజ్ (Manchu Manoj) అన్నారు. భవిష్యత్తులో కూడా ఈ ఆశ్రమానికి తనవంతు సహకారం ఎప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. రెండు నెలల క్రితమే 'మాతృదేవోభవ' అనాథాశ్రమం నిర్వాహకులు తనను సోషల్ మీడియాలో ట్యాగ్ చేస్తూ వీడియో పెట్టారని అది చూసి చలించిపోయినట్లు చెప్పారు. తాను రిహాబిలిటేషన్ సెంటర్ స్థాపించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.
ఇక ఇటీవలే మనోజ్ తన భార్యతో కలిసి ఐక్య సంస్థను ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రజల గొంతుకగా ఉండేందుకు దీన్ని ప్రారంభించినట్లు చెప్పారు. దీని కార్యకలాపాల కోసం సొంత నిధులనే వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ ట్రస్ట్ (Manchu Manoj Trust) ద్వారా రక్తదానం, చిన్నారుల దత్తత.. సహా పలు సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు వెల్లడించారు.



## ప్రతిభావంతులైన నటీనటులతో కలిసి పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా

భోజ్‌పురి స్టార్ నటి, సోషల్ మీడియా సెన్సేషన్ అక్షర సింగ్ 'వెల్‌కమ్ టు ది జంగిల్' చిత్రంతో బాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వనుంది. స్టార్ హీరో అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ కామెడీ ఫ్రాంచైజీలో సునీల్ శెట్టి, జాకీ ష్రాఫ్, రవీనా టాండన్, దిశా పటాని, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, అర్షద్ వార్సి, పరేష్ రావల్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత అక్షయ్ కుమార్, రవీనా టాండన్ క్రేజీ కాంబోలో ఈ సినిమాతో తిరిగి రావడం విశేషం. ఫిరోజ్ నడియాద్వాలా నిర్మించగా.. పక్క ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతుంది. అహ్మద్ ఖాన్ దర్శకత్వంలో రాబోతుండగా.. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మల్టీస్టారర్ సినిమా జూన్ 26న విడుదల కాబోతోంది.
ఈక్రమంలో.. ప్రమోషన్స్ జోరు పెంచిన మూవీ మేకర్స్ ఓ మాస్ సాంగ్‌ను విడుదల చేసి హైప్ క్రియేట్ చేశారు. ఇందులో అక్షయ్‌కి జోడీగా చేసిన అక్షర సింగ్ ఒక్క పాటతోనే సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో భాగంగా అక్షర సింగ్ తన సంతోషాన్ని అందరితో పంచుకుంటూ, తన సొంత రాష్ట్రమైన బిహార్ ప్రజలపై ఉన్న ప్రేమను చాటుకున్నారు. "ఒక బిహారీగా నాకు బాలీవుడ్‌లో ఇంతటి గొప్ప వేదిక లభించడం చాలా గర్వంగా ఉంది. ముఖ్యంగా స్టార్ హీరో అక్షయ్ కుమార్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం రావడం నా అదృష్టం. ఈ సినిమాలో ఎంతోమంది ప్రతిభావంతులైన నటీనటులు ఉన్నారు, వారందరితో కలిసి పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నేను ఈ రోజు ఈ స్థితిలో ఉన్నానంటే దానికి కారణం నా బిహార్ ప్రజల ప్రేమ, వారి ఆశీస్సులే" అని అక్షర సింగ్ ఎమోషనల్ అయ్యారు.



## క్రేజీ కాంబో.. 'బాలన్ ది బాయ్' సినిమా కోసం అక్కినేని నాగార్జునతో చేతులు కలిపిన మేకర్స్

'మంజుమ్మెల్ బాయ్స్' అనే మలయాళ సినిమాతో ఇండియా వైడ్‌గా ఒక పెద్ద బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ చిదంబరం దర్శకత్వంలో రాబోతున్న సరికొత్త సినిమా 'బాలన్ ది బాయ్'. కేవీఎన్ ప్రొడక్షన్స్ తెస్పియన్ ఫిలింస్ సంస్థలు సంయుక్తంగా ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. మనందరికీ బాగా కనెక్ట్ అయ్యే ఒక చక్కటి నేటివిటీ కథతో, అలాగే ప్రతి ఒక్కరి మనసును హత్తుకునే బలమైన సెంటిమెంట్, భావోద్వేగాలతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఈ క్రేజీ మూవీని వచ్చే నెల జూన్ 19, 2026 న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా చాలా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ డేట్ ఫిక్స్ చేశారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక బిగ్గెస్ట్ అప్‌డేట్ బయటకు వచ్చింది.
ఈ సినిమాకు సంబంధించిన రెండు తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్‌ను టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ, కింగ్ అక్కినేని నాగార్జునకు చెందిన 'అన్నపూర్ణ స్టూడియోస్' సొంతం చేసుకుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ ద్వారా ఎంతో ప్రతిష్టాత్మకంగా భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో ఒక ప్రత్యేకమైన పోస్ట్ పెట్టింది. "మా 'బాలన్ ది బాయ్' చిత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని థియేటర్లలో విడుదల చేయడం కోసం టాలీవుడ్ టాప్ డిస్ట్రిబ్యూషన్ అండ్ ప్రొడక్షన్ హౌస్ అయిన అన్నపూర్ణ స్టూడియోస్‌తో చేతులు కలపడం మాకు ఎంతో సంతోషాన్ని, గర్వాన్ని ఇస్తోంది. ఈ చిత్రం జూన్ 19, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది" అని మేకర్స్ ఆ పోస్ట్‌లో రాసుకొచ్చారు.




## రణ్‌వీర్ సింగ్‌పై బ్యాన్ కాదు.. FWICE చీఫ్ అడ్వైజర్ వివరణ

'డాన్ 3' (Don 3) సినిమా నుంచి వైదొలగడంతో ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్ (Ranveer Singh)పై చర్యలు తీసుకుంటున్నట్టు 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) సోమవారం ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆయనపై మూడేళ్లపాటు బ్యాన్ విధించినట్టు వార్తలొచ్చిన నేపథ్యంలో.. ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చీఫ్ అడ్వైజర్, ఫిల్మ్‌మేకర్ అశోక్ పండిట్ వివరణ ఇచ్చారు. అది అధికారిక బ్యాన్ కాదని స్పష్టం చేశారు. నటులపై నిషేధం విధించే అధికారం తమకు లేదని తెలిపారు. సమస్యకు పరిష్కారం లభించే వరకూ ఆయనతో కలిసి పనిచేయొద్దని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ సభ్యులను ఆదేశించామన్నారు. కారణం ఏదైనా ఓ ప్రాజెక్టు నుంచి దర్శకుడు వైదొలిగినా, నటుడు వెళ్లిపోయినా నిర్మాతకే నష్టమన్న విషయాన్ని గుర్తుచేశారు.
బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించాలనుకున్న 'డాన్ 3' నుంచి వైదొలిగినట్లు ఇటీవల వార్తలొచ్చాయి. ఈ క్రమంలో.. రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ.45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకూ ఆయనతో కలిసి పని చేయవద్దని ఆదేశిస్తూ ఎఫ్‌డబ్ల్యూఐసీఈ ప్రకటన జారీ చేసింది.



## లేడీ ఓరియెంటెడ్ కథలో మమిత..

'ప్రేమలు' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయిన మలయాళ ముద్దుగుమ్మ మమిత బైజు, ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. ఆ తర్వాత ప్రదీప్ రంగనాథన్ సరసన 'డ్యూడ్' సినిమాలో నటించి మరో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. తాజా సమాచారం ప్రకారం.. మమిత బైజు ఒక సరికొత్త లేడీ ఓరియెంటెడ్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇందులో మమితకు జోడీగా అశ్వత్ మరిముత్తు నటిస్తున్నారట. ఇక ఈ మూవీ కోసం యువ దర్శకుడు, నటుడు ప్రదీప్ రంగనాథ్ నిర్మాతగా మారినట్లు టాక్. ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ కూడా చెన్నైలో ప్రారంభం అయినట్లు తెలుస్తోంది. ప్రదీప్ రంగనాథ్ ప్రొడ్యూసర్‌గా మారడం భారీ రిస్క్ అని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 501510.